

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 26-08-2026 | సంపుటి - 31 | సంచిక - 93 | రూ : 4 | పేజీలు: 8


# 'మూసీ' ముందడుగు పడాలి

## నాగోల్-గౌరెల్లి మధ్య మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయండి

- పునరుజ్జీవ పనుల సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్ : మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో రెండో దశ పనులు ప్రారంభించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. నాగోల్ నుంచి గౌరెల్లి గ్రామం వరకు ఎక్కువ శాతం వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు ఉన్నందున.. ఆ ప్రాంతంలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయొచ్చని ఆయన నిర్దేశించారు. జిల్లా కలెక్టర్లు సంబంధిత అధికారులతో సర్వే చేయించి.. ప్రాజెక్టుకు అవసరమైన భూమిని గుర్తించాలన్నారు. హెచ్‌ఎండీఏ ఇప్పటికే అనుసరిస్తున్న విధానం ప్రకారం.. తరువాయి 2లో



## ఏడాదిలో దేవాదుల పూర్తి

- గోదావరి జలాలను గరిష్ఠంగా ఎత్తిపోస్తాం
- ప్రాజెక్టుపై సమీక్షలో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క

హైదరాబాద్: ఏడాది కాలంలో జె.చొక్కారావు దేవాదుల సాగునీటి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తామని నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుపై హైదరాబాద్‌లోని జలసౌధలో మంగళవారం అధికారులు, ఇంజినీర్లతో మంత్రులు సమీక్షించారు. గోదావరి జలాలను గరిష్ఠంగా ఎత్తిపోసి ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే కడియం శ్రీహరితోపాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. '38 టీఎంసీలను ఎత్తిపోసి పది జిల్లాల్లోని ఆయకట్టుకు సాగునీరు అందించాలి. భూసేకరణ, పునరావాసం, ఆర్ అండ్ ఆర్ తరువాయి 2లో



## ఫీజుల బకాయిలన్నీ చెల్లించేదాకా ప్రభుత్వాన్ని వదలం

- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు
- ముగిసిన 48 గంటల నిరాహార దీక్ష

హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటం ఆగదని భాజపా ముఖ్య నేతలు స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్ల బకాయిలు చెల్లించి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు 48 గంటలపాటు చేపట్టిన తరువాయి 2లో

### పెరుగుతున్న పంచదార ధరలు

## రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం

- పంచదార ధరల కట్టడికి దిగుమతి నిబంధనల సడలింపు
- ముడి పంచదార ప్రాసెసింగ్‌కు రెండు నెలల గడువు
- నిల్వలపై ఆంక్షలు కఠినతరం చేసిన కేంద్ర ప్రభుత్వం
- 10 లక్షల టన్నుల సుంకం లేని దిగుమతికి అనుమతి



పండుగ సీజన్ సమీపిస్తున్న తరుణంలో దేశీయ మార్కెట్‌లో పెరుగుతున్న పంచదార ధరలను అదుపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముడి పంచదార దిగుమతి నిబంధనలను సడలిస్తూ దిగుమతిదారులకు ఊరటనిచ్చే వెసులుబాటు కల్పించింది. దీని ప్రకారం, దిగుమతి చేసుకున్న ముడి పంచదారను శుద్ధి చేసి, స్థానిక మార్కెట్లో తరువాయి 2లో

### ప్యాకేజ్డ్ ఫుడ్‌పై హెచ్చరికలు

## వెనక్కి తగ్గిన ఎఫ్ఎస్ఎస్ఏఐ

- ప్యాకేజ్డ్ ఫుడ్‌పై హెచ్చరిక లేబుళ్ల ప్రతిపాదనను విరమించుకున్న ఎఫ్ఎస్ఎస్ఏఐ
- ఆహార కంపెనీల నుంచి వచ్చిన తీవ్ర ఒత్తిడితో వెనక్కి తగ్గిన సంస్థ
- విదేశాల్లో ఒక విధానం, భారత్‌లో మరో విధానం పాటిస్తున్న కంపెనీలు
- ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్ణయంపై సుప్రీంకోర్టులో కొనసాగుతున్న విచారణ

ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలపై ముద్రించే హెచ్చరిక లేబుళ్ల విషయంలో భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) వెనక్కి తగ్గింది. అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు కలిగిన ఆహార ప్యాకెట్ల ముందు భాగంలో ఎరుపు రంగుతో కూడిన స్పష్టమైన హెచ్చరిక గుర్తులను ముద్రించాలన్న తన ప్రతిపాదనను విరమించుకుంది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. తరువాయి 2లో

## ఇక సైన్యం చేతిలో 'షేర్'

### దేశీయంగా తయారైన ఏకే-203 రైఫిళ్లు రెడీ



2లో

- భారత సైన్యానికి త్వరలో ఏకే-203 రైఫిళ్ల డెలివరీ
- ఉత్తరప్రదేశ్‌లోని అమేథీలో దేశీయంగా తయారవుతున్న ఆయుధాలు
- ఈ రైఫిల్‌కు 'షేర్' అని నామకరణం చేసిన తయారీ సంస్థ
- రష్యా సహకారంతో ఏర్పాటైన IRRPL ఈ రైఫిళ్లను ఉత్పత్తి చేస్తోంది
- గడువుకు ఏడాది ముందే సరఫరా పూర్తి చేస్తామని ధీమా

### తొలిసారిగా మహిళలకు కమాండో శిక్షణ

## ఎన్ఎస్‌జీ కీలక ముందడుగు

- మహిళల కోసం తొలి కమాండో కన్వర్షన్ కోర్సును ప్రారంభించిన ఎన్ఎస్‌జీ
- రాష్ట్ర పోలీసు, కేంద్ర బలగాల మహిళా సిబ్బందికి ఈ శిక్షణ
- 12 వారాల పాటు కఠినమైన కౌంటర్ టెర్రరిజం శిక్షణ
- భద్రతా సవాళ్లను ఎదుర్కొనేలా మహిళలను శక్తిమంతం చేయడమే లక్ష్యం




భారత ఉగ్రవాద వ్యతిరేక పోరాట విభాగంలో మహిళల కార్యాచరణ సామర్థ్యాలను పెంపొందించే దిశగా జాతీయ భద్రతా దళం (ఎన్ఎస్‌జీ) చారిత్రాత్మక ముందడుగు వేసింది. తొలిసారిగా వివిధ రాష్ట్రాల పోలీసు దళాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సీఏపీఎఫ్) మహిళా సిబ్బంది కోసం హర్యానాలోని మానేసర్‌లోని ఎన్ఎస్‌జీ శిక్షణా అకాడమీలో 'మహిళా కమాండో కన్వర్షన్ కోర్సు' (ఎంసీసీసీ)ను ప్రారంభించింది. నారీశక్తి సాధికారతలో ఇదొక నూతన అధ్యాయమని ఎన్ఎస్‌జీ పేర్కొంది. 'సాహసవంతులే నాయకత్వం వహిస్తారు' అనే స్ఫూర్తిదాయక నినాదంతో ఈ కోర్సును రూపొందించారు. మొత్తం 12 వారాల పాటు సాగే ఈ అత్యంత కఠినమైన శిక్షణ ద్వారా మహిళా సిబ్బందిని శారీరక, సాంకేతిక, తరువాయి 2లో

### బెంగళూరులో విజృంభిస్తున్న

## హెచ్1ఎన్1.. ఢిల్లీ కంటే తీవ్రమా?



- ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో పెరుగుతున్న హెచ్1ఎన్1 కేసులు
- బెంగళూరు వాతావరణం వల్లే వ్యాధి వ్యాప్తి ఎక్కువ కాలం
- ఇది కొత్త రకం వైరస్ కాదని స్పష్టం చేసిన ఐసీఎంఆర్
- యాంటీబయాటిక్స్ సొంతంగా వాడొద్దని వైద్యుల హెచ్చరిక
- వ్యాక్సినేషన్‌తో వ్యాధి తీవ్రతను తగ్గించుకోవచ్చని సూచన

దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, బెంగళూరులలో హెచ్1ఎన్1 (స్వైన్ ఫ్లూ) కేసులు పెరుగుతున్నప్పటికీ, బెంగళూరులో పరిస్థితి మరీ ఆందోళనకరంగా ఉందని చెప్పలేమని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రెండు నగరాల మధ్య నిఘా వ్యవస్థ, పరీక్షల నిర్వహణ తీరు, వాతావరణ పరిస్థితుల్లోని వ్యత్యాసాల కారణంగానే కేసుల సంఖ్యలో ఈ తేడాలు కనిపిస్తున్నాయని వారు వివరిస్తున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఈ ఏడాది ఆగస్టు 20 నాటికి ఢిల్లీలో 1,777 కేసులు నమోదయ్యాయి. మరోవైపు, బెంగళూరులోని తరువాయి 2లో

# 'మూసీ' ముందడుగు పడాలి

హైదరాబాద్: మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో రెండో దశ పనులు ప్రారంభించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. నాగోల్ నుంచి గౌరెల్లి గ్రామం వరకు ఎక్కువ శాతం వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు ఉన్నందున.. ఆ ప్రాంతంలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయొచ్చని ఆయన నిర్దేశించారు. జిల్లా కలెక్టర్లు సంబంధిత అధికారులతో సర్వే చేయించి.. ప్రాజెక్టుకు అవసరమైన భూమిని గుర్తించాలన్నారు. హెచ్ఎండీఏ ఇప్పటికే అనుసరిస్తున్న విధానం ప్రకారం.. భూసమీకరణ చేపట్టాలని సూచించారు. చట్టపరమైన సమస్యలు తలెత్తకుండా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో, ఎసైన్డ్ భూముల విషయంలో స్పష్టమైన విధానంతో ముందుకెళ్లాలన్నారు. ఈ మేరకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని చెప్పారు. మూసీ ప్రాజెక్టు పురోగతిపై సీఎం మంగళవారం జూబ్లీహిల్స్ ఎంసీఆర్‌హెచ్‌డీలోని బోధి పెవిలియన్‌లో సమీక్ష నిర్వహించారు.

**మొదటి దశ పనులు మొదలవ్వాలి..**

మొదటి దశ కింద జంట జలాశయాల నుంచి బాపూ ఘాట్ వరకు 21 కి.మీ. పొడవునా నదికి ఇరువైపులా టీడీఆర్ సర్టిఫికెట్లతో భూసేకరణ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు మరోసారి స్పష్టం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో టీడీఆర్‌కు మంచి ధర ఉన్నందున ప్రజలకు అవగాహన కల్పించి భూసేకరణకు ఒప్పించాలన్నారు. టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఎంఆర్‌డీసీఎల్ ఎండీ నర్సింహారెడ్డి, జీహెచ్ఎంసీ, సీఎంసీ కమిషనర్లను ఆదేశించారు. టీడీఆర్ బాండ్ల జారీపై ప్రతి వారం సమీక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు. అభివృద్ధి పనులకు తక్కువ వడ్డీకి లభించే బ్యాంకు రుణాలపై దృష్టి పెట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కొత్వాల్‌గూడ ఎకో పార్కుకు ప్రాచుర్యం కల్పించాలని హెచ్ఎండీఏను ఆదేశించారు.

*** ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి త్వరలో టెండర్లు**

గండిపేట జలాశయం వద్ద మంచిరేవుల వీరభద్రస్వామి గుట్టపై ఓంకారేశ్వర ఆలయ నిర్మాణంపైనా సీఎం సమీక్ష చేశారు. ఈ ప్రాజెక్టు మాస్టర్ ప్లాన్ దాదాపు సిద్ధమైందని, మరో పది రోజుల్లో టెండర్లు పిలుస్తామని అధికారులు సీఎంకు వివరించారు. ఆలయ నిర్మాణంతోపాటు.. దేవాలయాన్ని గండిపేట గ్రామం, ఓఆర్ఆర్‌తో అనుసంధానించే రహదారిని 100 అడుగులకు విస్తరించడం, మూసీ నదిలో ద్వీపాన్ని అభివృద్ధి చేసి, అక్కడ 100 అడుగుల ఎత్తయిన శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వంటి పనులన్నింటికీ కలిపి ఒకేసారి టెండర్ పిలుస్తామని తెలిపారు. రహదారి విస్తరణ పనులను కొత్తగా ప్రాజెక్టులో చేర్చినట్లు ఎంఆర్‌డీసీఎల్ ఎండీ నర్సింహారెడ్డి వెల్లడించారు. ఈ సమావేశాల్లో సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ నగరపాలక సంస్థల కమిషనర్లు సర్ఫరాజ్ అహ్మద్, ఆర్వీ కర్ణన్, వినయ్ కృష్ణారెడ్డి, జి.సృజన, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు నారాయణరెడ్డి, మను చౌదరి, ఎంఆర్‌డీసీఎల్ జేఎండీ గౌతమి, చార్మినార్ జోన్ కమిషనర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమకు సుజ్లాన్ భరోసా

(మొదటిపేజీ తరువాయి)
సంస్థ రూ.10,000 కోట్ల భారీ పెట్టుబడితో నెలకొల్పనున్న విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 4,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాయదుర్గం నియోజకవర్గంలోని కనేకల్లు మండలం, హులికెర గ్రామం వద్ద ఈ భారీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. మొత్తం 1,325 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న ఈ పవన విద్యుత్ ప్రాజెక్టులను రాయదుర్గం, ఉరవకొండ, కల్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, సుజ్లాన్ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన 'S144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్'ను కూడా మంత్రి లోకేశ్ అధికారికంగా ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ప్రాజెక్టుకు సంబంధించిన ఆడియో విజువల్ (ఏవీ) ప్రదర్శనను వీక్షించారు. అంతకుముందు బళ్లారి సమీపంలోని హలకుంది గ్రామంలో ఉన్న సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును మంత్రి సందర్శించి, అక్కడి విండ్ టర్బైన్‌పై తన సంతకం చేశారు. ఈ సందర్భంగా సుజ్లాన్ ప్రతినిధులు ప్రాజెక్టు విశేషాలను మంత్రికి వివరించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో 1,700 మెగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యంతో అతిపెద్ద విండ్ భాగస్వామిగా ఉన్న సుజ్లాన్, తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. 2030 నాటికి రాష్ట్రంలో అదనంగా మరో 5,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను స్థాపించడమే లక్ష్యంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. పవన విద్యుత్ ఉత్పత్తిలో ఏపీని కీలక కేంద్రంగా మార్చేందుకు ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కీలక కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా జి. లక్ష్మీనారాయణ, స్థానిక ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు (రాయదుర్గం), అమిలినేని సురేంద్రబాబు (కల్యాణదుర్గం), దగ్గుపాటి వెంకట ప్రసాద్ (అనంతపురం అర్బన్) పాల్గొన్నారు. సుజ్లాన్ గ్రూప్ తరఫున కోఫౌండర్, వైస్ ఛైర్మన్ గిరీష్ తంతి, సీఈవో అజయ్ కపూర్, అడ్వైజర్ వి.బి. రావు, ఇతర భాగస్వామ్య సంస్థలైన టాటా పవర్ ఎండీ సంజయ్ బంగా, టోరెంట్ పవర్ డైరెక్టర్ జిగీష్ మెహతా, వారీ ఎనర్జీస్ సీఎండీ హితేష్ దోషి, ఎన్ఆర్ఈడీసీఏపీ లిమిటెడ్ వీసీ, ఎండీ ఎమ్. కమలాకర బాబు, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

## తొలిసారిగా మహిళలకు కమాండో శిక్షణ ఎన్ఎస్‌జీ కీలక ముందడుగు

(మొదటిపేజీ తరువాయి)
పోరాట రంగాలలో అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఉగ్రవాద నిరోధక ఆపరేషన్లలో వారిని కీలక బాధ్యతల కోసం సిద్ధం చేయనున్నారు. ఈ శిక్షణలో భాగంగా కఠినమైన శారీరక దారుఢ్యం, అధునాతన ఆయుధాల వినియోగం, మార్క్స్‌మన్‌షిప్, వ్యూహాత్మక దాడులు, బందీల విముక్తి వంటి క్లిష్టతరమైన అంశాలపై ప్రత్యేక తర్ఫీదు ఇస్తారు. ఈ శిక్షణ కేవలం వ్యక్తిగత నైపుణ్యాల పెంపునకే కాకుండా, వివిధ భద్రతా దళాల మధ్య సమన్వయం పెంచడానికి కూడా దోహదపడుతుందని ఎన్ఎస్‌జీ స్పష్టం చేసింది. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా సిబ్బంది తమ మాతృ సంస్థలకు తిరిగి వెళ్లి, అక్కడ తమ నైపుణ్యాలను ప్రదర్శించడం ద్వారా దేశవ్యాప్తంగా ఉగ్రవాద నిరోధక సామర్థ్యం మరింత పటిష్ఠం కానుంది. ఈ విశిష్టమైన కార్యక్రమం గురించి ఎన్ఎస్‌జీ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా వెల్లడించింది. సంక్లిష్టమైన భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో మహిళలను సన్నద్ధం చేసే ప్రక్రియలో ఈ కోర్సు ఒక మైలురాయిగా నిలవనుంది.

## బెంగళూరులో విజృంభిస్తున్న హెచ్1ఎన్1.. ఢిల్లీ కంటే తీవ్రమా?

(మొదటిపేజీ తరువాయి)
ఒక పాఠశాలలో 500 మందికి పైగా విద్యార్థులు, సిబ్బంది ఫ్లూ లక్షణాలతో బాధపడగా, వారిలో ఇద్దరికి స్వైన్ ఫ్లూ ఉన్నట్లు నిర్ధారణ అయింది. అయితే, ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్నది కొత్త రకం వైరస్ కాదని, అందుబాటులో ఉన్న వ్యాక్సిన్ల ద్వారా నివారించదగ్గ పాత స్ట్రెయిన్ మాత్రమేనని ఐసీఎంఆర్ స్పష్టం చేసింది. బెంగళూరు వాతావరణం కారణంగా ఇక్కడ శ్వాసకోశ సంబంధిత వైరల్ ఇన్ఫెక్షన్లు ఎక్కువ కాలం ప్రభావాన్ని చూపుతాయని ఆస్టర్ వైట్‌ఫీల్డ్ హాస్పిటల్స్‌కు చెందిన డాక్టర్ ఐశ్వర్య తెలిపారు. సాధారణంగా జూన్ నెలలో ప్రారంభమయ్యే ఈ కేసులు, జనవరి-ఫిబ్రవరి వరకు కొనసాగుతాయని, దీనివల్ల వ్యాధి వ్యాప్తి సుదీర్ఘకాలం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం పొడి దగ్గు, గొంతు నొప్పి, జ్వరం, కండరాల నొప్పులు, తీవ్రమైన నీరసం వంటివి ప్రధాన లక్షణాలుగా కనిపిస్తున్నాయి. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులతో పాటు ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాల సంబంధిత దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. లక్షణాలు తీవ్రంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని, సొంతంగా యాంటీబయాటిక్స్ వాడకూడదని హెచ్చరిస్తున్నారు. వ్యాక్సినేషన్ తీసుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతను, ఆసుపత్రిలో చేరాల్సిన ముప్పును తగ్గించుకోవచ్చని వారు స్పష్టం చేస్తున్నారు.

## పెరుగుతున్న పంచదార ధరలు రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)
విక్రయించే ప్రక్రియకు ఇకపై రెండు నెలల గడువు లభించనుంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) ఈ మేరకు నూతన మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆగస్టు 20న వెలువడిన ఆదేశాల ప్రకారం, టారిఫ్ రేట్ కోటా (టీఆర్‌క్యూ) కింద 10 లక్షల టన్నుల ముడి పంచదారను 2026 అక్టోబర్ 31లోపు దిగుమతి చేసుకుని, అదే గడువులోగా శుద్ధి చేసి విక్రయించాల్సి ఉంది. అయితే, తాజా సవరణ ద్వారా ఈ నిబంధనను మారుస్తూ, దిగుమతి పత్రాలను (బిల్ ఆఫ్ ఎంట్రీ) సమర్పించిన తేదీ నుంచి రెండు నెలల సమయాన్ని కేటాయించారు. దేశీయంగా పంచదార ధరలు గణనీయంగా పెరగడమే ఈ నిర్ణయానికి ప్రధాన ప్రాతిపదిక. జూలై 20వ తేదీన కిలో పంచదార ధర రూ. 48.18 ఉండగా, ఆగస్టు 24 నాటికి అది ఏకంగా రూ. 63.05కి చేరింది. చక్కెర ఉత్పత్తి తగ్గడం, ప్రతికూల వాతావరణం వల్ల పంట నష్టం వాటిల్లడం, అక్రమ నిల్వలు పెరగడం వంటి అంశాలే ఈ ధరల పెరుగుదలకు కారణమని ప్రభుత్వం విశ్లేషిస్తోంది. ప్రస్తుతం దేశంలో కేవలం 35 నుంచి 39 లక్షల టన్నుల నిల్వలు మాత్రమే ఉండగా, నిబంధనల ప్రకారం 60 లక్షల టన్నుల బఫర్ స్టాక్ ఉండాల్సి ఉంది. ధరల నియంత్రణలో భాగంగా ప్రభుత్వం ఇతర కీలక చర్యలను సైతం చేపట్టింది. సెప్టెంబర్ 1 నుంచి బల్క్ వినియోగదారులకు పంచదార నిల్వ పరిమితిని 15 రోజులకు కుదించింది. అలాగే, ఆగస్టు 17 నుంచి 19 మధ్య జరిగిన విక్రయాల పూర్తి వివరాలను వెల్లడించాలని చక్కెర మిల్లులను ఆదేశించింది. ఈ చర్యల ద్వారా మార్కెట్‌లో సరఫరాను పెంచి, పండుగ సీజన్‌లో వినియోగదారులపై ధరల భారాన్ని తగ్గించడమే కేంద్రం లక్ష్యంగా కనిపిస్తోంది.

## ఇక సైన్యం చేతిలో 'షేర్
## దేశీయంగా తయారైన ఏకే-203 రైఫిళ్లు రెడీ

(మొదటిపేజీ తరువాయి)
రక్షణ రంగంలో ఆత్మనిర్భరత సాధించే దిశగా భారత్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ జిల్లా కోర్వాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో దేశీయంగా తయారు చేసిన ఏకే203 అసాల్ట్ రైఫిళ్లు భారత సైన్యానికి చేరవేసేందుకు సిద్ధమయ్యాయి. త్వరలోనే వీటి డెలివరీ ప్రారంభం కానుంది. ఈ అత్యాధునిక రైఫిళ్లకు 'షేర్' అని పేరు పెట్టారు. సైన్యానికి చిన్న ఆయుధాల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ రైఫిళ్లు కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. ఈ రైఫిళ్లను ఇండోరష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉత్పత్తి చేస్తోంది. ఈ సందర్భంగా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ మేజర్ జనరల్ సుధీష్ కుమార్ శర్మ మాట్లాడుతూ.. అమేథీలో ఏకే 203 రైఫిళ్లను తయారు చేయడం దేశానికి గర్వకారణమని అన్నారు. దేశ భద్రత, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 'షేర్' రైఫిళ్లను ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. భారత సైన్యానికి సకాలంలో రైఫిళ్లను అందించడానికి తాము కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. సుమారు 2019లో భారత సైన్యం, రక్షణ మంత్రిత్వ శాఖ ఈ రైఫిళ్ల తయారీకి సంబంధించిన నిర్ణయం తీసుకున్నాయని శర్మ గుర్తుచేశారు. ఒప్పందంలో భాగంగా, రష్యా నుంచి టెక్నాలజీ బదిలీ జరిగిందని, ఆ తర్వాత దేశీయ ఉత్పత్తి కోసం కాంట్రాక్ట్ కుదిరిందని వివరించారు. ఒప్పందం ప్రకారం నిర్దేశించిన సమయానికి రైఫిళ్లను అందిస్తామనే నమ్మకంతో రక్షణ శాఖ తమపై విశ్వాసం ఉంచిందని ఆయన పేర్కొన్నారు. కాంట్రాక్ట్ గడువు 2032 వరకు ఉన్నప్పటికీ, తాము నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం ఏడాది ముందే, అంటే 2031 నాటికే రైఫిళ్ల సరఫరాను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మేజర్ జనరల్ శర్మ ధీమా వ్యక్తం చేశారు. ఈ రైఫిళ్ల తయారీ కోసం భారత ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ, రష్యాకు చెందిన కన్సర్న్ కలాష్నికోవ్, రోసోబోరోన్‌ఎక్స్‌పోర్ట్ సంస్థల భాగస్వామ్యంతో IRRPL జాయింట్ వెంచర్‌గా ఏర్పడింది. ఈ వెంచర్ ద్వారా మొత్తం 6 లక్షలకు పైగా ఏకే 203 రైఫిళ్లను తయారు చేయనున్నారు. విదేశీ ఆయుధ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, దేశీయ రక్షణ ఉత్పత్తులను ప్రోత్సహించాలనే ప్రభుత్వ లక్ష్యంలో ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమైనదిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

## ప్యాకేజ్డ్ ఫుడ్‌పై హెచ్చరికలు వెనక్కి తగ్గిన ఎఫ్ఎస్ఎస్ఏఐ

(మొదటిపేజీ తరువాయి)
ఈ ఏడాది మార్చిలో ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులతో జరిగిన సమావేశంలో, కోకా కోలా వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు రంగుల హెచ్చరిక లేబుళ్ల విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ లేబుళ్లు గందరగోళానికి దారితీస్తాయని, వాటివల్ల ఆహారపు అలవాట్లలో ఎటువంటి మార్పు రాదని వారు వాదించారు. కేవలం చిహ్నాలను చూసి ప్రజల ఆహార అలవాట్లు మారతాయని భావించడం సరైంది కాదని కోకా కోలా ఇండియాకు చెందిన ఒక ఉన్నతాధికారి వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ, 'కలర్' హెచ్చరికల ప్రతిపాదనను ఉపసంహరించుకుంది. వాటి స్థానంలో కేవలం చక్కెర, కొవ్వు, ఉప్పు శాతాలను తెలిపే నలుపుతెలుపు పట్టికను ప్యాకెట్ల ముందు భాగంలో ఉంచాలని ప్రతిపాదించింది.




ఈ విషయాన్ని ఆగస్టులో సుప్రీంకోర్టుకు విన్నవించింది. అయితే, ఈ నిర్ణయంపై ప్రజారోగ్య కార్యకర్తలు దాఖలు చేసిన పిటిషన్లను విచారిస్తున్న సుప్రీంకోర్టు, ఎఫ్ఎస్ఎస్ఏఐ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. "భారతీయుల ఆరోగ్యం పట్ల దేశానికి శ్రద్ధ ఉందనే విషయం ప్రపంచానికి తెలియాలి" అని ఈ సందర్భంగా న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, ఐరోపా, బ్రిటన్ వంటి దేశాల్లో కోకాకోలా, నెస్లే వంటి కంపెనీలు స్వచ్ఛందంగా స్పష్టమైన ట్రాఫిక్‌లైట్ లేబుళ్లను ఉపయోగిస్తున్నాయి. కానీ, భారత్‌లో మాత్రం ఆ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయి. అంతేకాకుండా, విదేశాల్లో విక్రయించే ఉత్పత్తులతో పోలిస్తే, భారత్‌లో అమ్మే ఫాంటా వంటి పానీయాల్లో చక్కెర శాతం ఎక్కువగా ఉండటం, కిట్‌క్యాట్, మ్యాగీ వంటి ఉత్పత్తుల నాణ్యతలో వ్యత్యాసాలు ఉండటం గమనార్హం. ప్రస్తుతం ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు వెలువరించే తుది నిర్ణయం కోసం సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## ఏడాదిలో దేవాదుల పూర్తి

హైదరాబాద్: ఏడాది కాలంలో జె.చొక్కారావు దేవాదుల సాగునీటి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తామని నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుపై హైదరాబాద్‌లోని జలసౌధలో మంగళవారం అధికారులు, ఇంజినీర్లతో మంత్రులు సమీక్షించారు. గోదావరి జలాలను గరిష్ఠంగా ఎత్తిపోసి ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే కడియం శ్రీహరితోపాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. '38 టీఎంసీలను ఎత్తిపోసి పది జిల్లాల్లోని ఆయకట్టుకు సాగునీరు అందించాలి. భూసేకరణ, పునరావాసం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు, అటవీ అనుమతులపై ప్రత్యేకంగా దృష్టిసారించాలి' అని ఆదేశించారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ 'ప్రతి సమస్యకు స్పష్టమైన పరిష్కారం, బాధ్యత, గడువును అధికారులు నిర్ణయించాలి. భూసేకరణ, అనుమతులు, నిర్మాణ పనులు, నిధుల విడుదల, నిర్మాణదారులకు సంబంధించిన సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం, అధికారులు, ఇంజినీర్లు సమన్వయంతో పనిచేయాలి' అని పేర్కొన్నారు.

## ఫీజుల బకాయిలన్నీ చెల్లించేదాకా ప్రభుత్వాన్ని వదలం

హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటం ఆగదని భాజపా ముఖ్య నేతలు స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్ల బకాయిలు చెల్లించి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు 48 గంటలపాటు చేపట్టిన 'ఫీజు బకాయి... బీజేపీ లడాయి' నిరాహార దీక్ష మంగళవారం ముగిసింది. రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ విద్యార్థులతో కలిసి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అనంతరం రామచందర్‌రావు మాట్లాడుతూ.. దీక్ష విరమించినప్పటికీ విద్యార్థుల కోసం జరిగే ఈ పోరాటం ఆగదని స్పష్టంచేశారు. బకాయిలు చెలించనిపక్షంలో సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... "విద్యార్థులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర సర్కారు తుంగలో తొక్కింది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వాన్ని నిందిస్తోంది. రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల బాధితులు కూడా పెద్ద మొత్తంలో ఉన్నారు. వారి పక్షాన కూడా వచ్చే నెల 5,6 తేదీలలో పోరాటం చేస్తాం. సెప్టెంబరు 7న అసెంబ్లీని ముట్టడిస్తాం" అని హెచ్చరించారు. రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ... "రాహుల్‌గాంధీ రాష్ట్ర విద్యార్థులకు ఇచ్చిన అనేక హామీలు నెరవేరకపోగా..కాంగ్రెస్ ప్రభుత్వం ఫీ రీయింబర్స్‌మెంట్ చేయకపోవడం వారిని మోసం చేయడమే. ఇప్పుడాయన తెలంగాణకు వస్తే విద్యార్థులకు ఏం సమాధానం చెబుతారు" అని నిలదీశారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ... "ఫీజు రీయింబర్స్‌మెంట్ జరగకపోవడంతో లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడింది. విద్యార్థుల జీవితాలతో సీఎం రేవంత్‌రెడ్డి చెలగాటం ఆడుతున్నారు" అని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, పార్టీ సీనియర్ నేత మురళీధర్‌రావు, ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

*** ఒకేసారి బకాయిలన్నీ చెల్లిస్తామన్న హామీ ఏమైంది: బండి సంజయ్**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నీ ఒకేసారి చెల్లిస్తామని గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఎన్. రామచందర్‌రావు దీక్షకు సంఘీభావం తెలుపుతూ మంగళవారం సంజయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. "హామీలిచ్చి మోసం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం.. భారాస సర్కారును మించి పోతోంది. తక్షణమే రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు.

## పచ్చదనము పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

*** సూర్యాపేట జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు గుండు రామాంజి గౌడ్**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : మండలంలోని రాయినిగూడెం గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు పర్యావరణ పరిరక్షణ పచ్చదనం పెంపొందించడం మరియు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించాలని సంకల్పంతో తాటి చెట్లు ఈత చెట్లు నాటారు. తాటి ఈత చెట్లు గ్రామీణ జీవన విధానంతో ముడిపడి ఉన్న విలువైన వృక్షాలు ఇవి పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో పాటు గ్రామీణ ప్రాంతాల జీవవైవిధ్యానికి ఎంతో ఉపయోగపడతాయి ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఈ కార్యక్రమం ద్వార సర్పంచ్ గుండు రామాంజిగౌడ్ పిలుపునిచ్చారు మొక్క నాటడం పచ్చని రాయినిగూడెం నిర్మిద్దాం అనే లక్ష్యంతో మన వనమహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎక్స్ఛేంజ్ ఎస్ఐ వెన్నెల పీఏసీఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, కార్యదర్శి సునీత, ఈసీ సుజాత, డాక్టర్ జుట్టుకొండ సుష్మ, ఎక్స్ఛేంజ్ కానిస్టేబుల్ బి గురవయ్య, బి శ్రీనివాస్, వీరస్వామి ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఎన్నిక

**- జిల్లా అధ్యక్షునిగా ఎర్రోళ్ల శాంతి కుమార్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నూతన కమిటీని చౌటుప్పల్ మండల కేంద్రంలో మంగళవారం ఎన్నుకున్నారు. బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్చార్జ్ వినోద్ యాదవ్, ధర్మసమాజ్ పార్టీ యాదాద్రి జిల్లా ఇన్చార్జి, రాష్ట్ర నాయకుడు నల్ల నరేందర్ ల ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. ధర్మ సమాజ్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా ఎర్రోళ్ల శాంతి కుమార్, జిల్లా ఉపాధ్యక్షులుగా రాసాల అశోక్ యాదవ్, కొంగరి లింగస్వామి, సుదెం మహేష్, ప్రధాన కార్యదర్శిగా వెలువర్తి శ్రీకాంత్, జిల్లా కార్యదర్శులుగా బిఆర్ సాయి కుమార్, ఏర్పుల సురేష్, కొమ్ము సాయికిరణ్, బండెల రవి, జిల్లా మీడియా ఇన్చార్జిగా పంది నరేష్, నార్కట్ పల్లి సుధాకర్, జిల్లా నాయకునిగా గడ్డం జలందర్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షుడు ఎర్రోళ్ల శాంతి కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ధర్మ సమాజ్ పార్టీని మరింత బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేయడంతో పాటు సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ప్రజల సమస్యలపై నిరంతరం ఉద్యమాలు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ మహేష్, సిహెచ్ సాయి కుమార్, నరేందర్, గణేష్, సందీప్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న 25క్వింటాళ్ల పిడిఎఫ్ బియ్యం సీజ్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి : చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ ఎక్స్ రోడ్ లో అక్రమంగా తరలిస్తున్న 25క్వింటాల పిడిఎఫ్ బియ్యాన్ని మంగళవారం సీజ్ చేశారు. సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు ఏఎస్ఐ కరుణాకర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వలిగొండ ఎక్స్ రోడ్ వద్ద తనిఖీలు చేయగా, అనుమానాస్పదంగా ఉన్న వాహనాన్ని గుర్తించామన్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా, 25క్వింటాళ్ల పిడిఎఫ్ బియ్యం ఉన్నట్టు తెలిపారు. వాహన డ్రైవర్ లావుడ్య శ్రీనివాస్, క్లీనర్ గుగులోతు అరుణ్ లను విచారించగా మిర్యాలగూడ చుట్టుపక్కల గ్రామాల్లో వెళ్లి బియ్యం కొనుగోలు చేసి సుమారు 25క్వింటాల బియ్యాన్ని హైదరాబాద్ కు తరలిస్తున్నట్లు తెలిపారు. మార్గమధ్యంలో చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు. వాహనంతో పాటు బియ్యాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సిఐ మన్మథ కుమార్ తెలిపారు.

## చిట్యాల పోలీస్ స్టేషన్లో ఎస్పీ వార్షిక తనిఖీ




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ మంగళవారం చిట్యాల సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటారు. స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణతో పాటు పెండింగ్ కేసులు, సీసీటీఎన్ఎస్ నమోదు, బ్లూకోల్ట్ వాహనాల పనితీరు, సీసీ కెమెరాల పరిస్థితిపై ఎస్పీ సమీక్షించారు. స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని, లోపాలను వెంటనే సరిచేయించాలని అధికారులను ఆదేశించారు. రిసెప్షన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. రౌడీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగించాలని, ప్రజలకు స్నేహపూర్వకంగా, పారదర్శకంగా సేవలందించాలని ఆదేశించారు.ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నిష్పాక్షికంగా సేవలు అందించాలి అని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కీతవారిగూడెంలో వనమహోత్సవం

**డెంగ్యూ–మలేరియాపై అవగాహన**

గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: పచ్చదనం పెంపొందించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని సి హెచ్ ఎస్ డి సెయింట్ థెరిస్సా కళాశాల ఫర్ ఉమెన్, ఏలూరు విద్యార్థులు పేర్కొన్నారు. కెవికె గడ్డిపల్లి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్పీరియన్స్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కీతవారిగూడెం గ్రామంలో వనమహోత్సవం, డెంగ్యూ-మలేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.వనమహోత్సవంలో భాగంగా గ్రామంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా విద్యార్థులు గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు.మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ,పచ్చదనం పెంపొందడం,స్వచ్ఛమైన గాలి అందడం,భూగర్భజలాల నియంత్రణ వంటి ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించి పెద్ద చెట్లుగా పెంచే



బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అవగాహన కల్పించారు. అనంతరం కీతవారిగూడెం ప్రాథమిక పాఠశాలలో డెంగ్యూ, మలేరియా నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమల ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందుతాయని,పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం,చెత్త పేరుకుపోవడం వల్ల దోమల వృద్ధికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని విద్యార్థులు, గ్రామస్తులకు వివరించారు. నీరు నిల్వ ఉండకుండా చూడటం, చెత్తను నిర్ణీత ప్రదేశాల్లోనే వేయడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు.పాఠశాల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థ పదార్థాలు, మురుగు ప్రాంతాలను గ్రామపంచాయతీ సహకారంతో బుల్డోజర్ ద్వారా తొలగించి పరిశుభ్రం చేశారు. దోమల నివారణకు నిరంతరం పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కీతవారిగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, గ్రామ సర్పంచ్ బొల్లేపల్లి రామనాధం, ఉపాధ్యాయులు,విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.ఆర్ఎడబ్ల్యుఈ విద్యార్థులు గ్రామ ప్రజలతో కలిసి పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యంపై అవగాహన కల్పించడం పట్ల గ్రామస్థులు అభినందించారు.

## పెండింగ్ కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

*** రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి**




భువనగిరి, ప్రజాస్ఫూర్తి : మంగళవారం అదనపు కలెక్టర్ వెంక రెడ్డిఛాంబర్ లో జిల్లాలోని రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్ ) పురోగతిపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కస్టమ్ మిల్లింగ్ రైస్‌కు సంబంధించి పచ్చి బియ్యం ను వెంటనే అందజేయాలని, నిర్దేశిత గడువులోగా కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియను పూర్తిచేసి బియ్యాన్ని ప్రభుత్వానికి అందించాలని మిల్లర్లను ఆదేశించారు.అలాగే ప్రభుత్వానికి చెల్లించాల్సిన బియ్యం విషయంలో ఎలాంటి జాప్యం చేయకుండా నిర్ణీత గడువును పాటించాలని సూచించారు. బ్యాంక్ గ్యారంటీలను వెంటనే సమర్పించాలని స్పష్టం చేశారు. పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత లక్ష్యాలను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని వెంక రెడ్డి కోరారు ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రోజా రాణి పౌరసరపరాల సంస్థ మేనేజర్ హరికృష్ణజిల్లాలోని రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఢిల్లీలో జరిగిన విద్యార్థుల ఆందోళనలో వారిపై పోలీసులు లాటీచార్జి చేయడంతో పాటు భాష్ప వాయు ప్రయోగం చేశారని, విద్యార్థులపై తూటాల పేల్చడంతో కొందరు విద్యార్థులు మరణించారని యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ అన్నారు. మంగళవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఢిల్లీలో విద్యార్థులపై అమానుషకాండకు నిరసనగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీవుల్లాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్షలో లీకేజీకి బాధ్యత వహించి విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశార, ని విద్యార్థులపై లాఠీచార్జ్ చేయించినటువంటి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో విద్యా వ్యవస్థను బిజెపి కాషాయకరణం చేస్తుందని, దేశ ప్రజలను మతం పేరుతో విభజన చేస్తుందని వారు విమర్శించారు. బిజెపి విధానాలు దేశ సమైక్యతను, సమగ్రతను దెబ్బతీసే విధంగా వున్నాయని సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, బైరు వెంకన్న, ఇస్రార్, కౌన్సిలర్ లు నాగుల వాసు, కొణతం రాజేష్‌రెడ్డి, గుణగంటి సతీష్ ,సైదులు, వల్దాసు రెబల్ శ్రీను, బండారు వెంకన్న, చంచల నిఖిల్, బుక్య మహేష్, పంతంగి దశరద, పడిదల రవి,నరేందర్ నాయుడు ,యూత్ కాంగ్రెస్ నాయకులు జావిద్ బేగ్, విజయ భాస్కర్, ప్రతాప్, ప్రశాంత్, సుధీర్, శ్రావ్య రెడ్డి, చింత సుధీర్, బొడ్డు సాయి తదితరులు పాల్గొన్నారు.

## మారుమూల గ్రామీణ యువతకు పోలీస్ ఉద్యోగాలపై అవగాహన

*** ఉచిత శిక్షణకు ఆహ్వానం.**



ప్రజాస్ఫూర్తి, జన్నారం: ఇటీవల తెలంగాణ ప్రభుత్వం పోలీస్ శాఖలో పోలీస్ కానిస్టేబుల్ , సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎస్ ఐ) పోస్టుల భర్తీకి సంబంధించిన నియామక ప్రక్రియను చేపట్టిన నేపథ్యంలో, మారుమూల గ్రామాల్లోని యువతకు ఈ ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడంతో పాటు వారికి ఉచితంగా శిక్షణ అందించేందుకు రామగుండం కమిషనరేట్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పోలీస్ ఉద్యోగ శిక్షణ కార్యక్రమంపై మంగళవారం ఇంధన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నాయకపు గూడెం గ్రామంలో యువతీ యువకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జన్నారం ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్ గ్రామంలోని యువతీ యువకులతో మాట్లాడుతూ పోలీస్ శాఖలో కానిస్టేబుల్ , సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్నప్పటికీ సరైన మార్గదర్శకత్వం, శిక్షణ , ఆర్థిక పరిస్థితుల కారణంగా పోటీ పరీక్షలకు సిద్ధం కాలేకపోతున్న యువతకు పోలీస్ శాఖ అందిస్తున్న ఉచిత కోచింగ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పోలీస్ ఉద్యోగాలకు సంబంధించిన అర్హతలు, ఎంపిక విధానం, రాత పరీక్ష, శారీరక దారుఢ్య పరీక్ష తదితర అంశాలపై అభ్యర్థులు ముందుగానే అవగాహన పెంచుకొని, క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని ఎస్సై సూచించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా చదువుతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగ ఎంపికలో మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.

## భవిష్యత్ తరాల కోసం విస్తృతంగా మొక్కలు నాటాలి

*** నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి.**



ప్రజాస్ఫూర్తి ,నల్లగొండ: భవిష్యత్తు తరాల కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి కాపాడాలని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నల్గొండ పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జరిగిన వన మహోత్సవంలో మేయర్ పాల్గొని విద్యార్థినీలతో కలిసి కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మొక్క నాటి పెద్ద వృక్షంగా ఎదిగే వరకు కృషి చేయాలన్నారు. కార్పొరేషన్ ను గ్రీన్ సిటీగా మార్చేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని అన్నారు.పెద్ద ఎత్తున మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలన్నారు. కమిషనర్ బి.వంశీకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.నగరంలో పచ్చదనం పెంచేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ మహమ్మద్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, 14వ డివిజన్ కార్పొరేటర్ బొజ్జ శంకర్, 16వ డివిజన్ కార్పొరేటర్ పెరిక స్వాతి, డిప్యూటీ ఈఈ పి. అశోక్ కుమార్, ఏఈ వి. దిలీప్ భార్గవ, అసీం బాబా,శానిటరీ సూపర్‌వైజర్ గడ్డం శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ రెడ్డి, హరితహారం సిబ్బంది, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లిన కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు మెదక్ టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. మెదక్ పట్టణం సాయి నగర్ కాలనీకి చెందిన 68 ఏళ్ల బాలెశెట్టి సులోచన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలోని సుమారు నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు ను లాక్కెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటన పై క్రైం ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టామన్నారు. దయారా స్ట్రీట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన చాకలి మొగులయ్య (34) అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు ఆయన తెలిపారు. నిందితుడి నుంచి చోరీ కి గురైన 4 లక్షల 50 వేల విలువ గల బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడి పై గతంలో ఆటో దొంగతనం, రేషన్ బియ్యం అక్రమ తరలింపు కేసులు ఉన్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన క్రైమ్ టీ నర్సింలు, మల్లేశం ను ఇన్‌స్పెక్టర్ మహేష్ అభినందించారు.

## పాత కొత్తగూడెం ఎస్సీ కాలనీ ఇందిరమ్మ బిల్లుల సమస్యను పరిష్కరించాలి



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాత కొత్తగూడెం 11వ డివిజన్ కార్పొరేటర్ పడాల ఆకాంక్ష సూచన మేరకు సీనియర్ సిపిఐ నాయకులు పడాల భవాని ప్రసాద్, డివిజన్ ఇన్చార్జి యూత్ లీడర్ కుంపటి నాగరాజు ఆధ్వర్యంలో పాత కొత్తగూడెం ఎస్సీ కాలనీ లో ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల సమస్య పరిష్కరించాలని కోరుతూ సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్. కె .సాబీర్ పాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దృష్టికి సమస్యను తీసుకెళ్లానని ఎమ్మెల్యే హౌసింగ్ ఎండి తో మాట్లాడారని త్వరలోనే పరిష్కారం చూపుతారని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు .

## వలిగొండ పోలీస్ స్టేషన్లో పీస్ కమిటీ సమావేశం



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : నేడు జరిగేమిలాద్ ఉన్ నబి పండుగను పురస్కరించుకొని మంగళవారం వలిగొండ పోలీస్ స్టేషన్లో హిందూ ముస్లిం మత పెద్దలు ప్రజా ప్రతినిధులు ఇంకా శాంతి కమిటీ సభ్యులతో స్థానిక ఎస్ఐ ఏ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు ఈ సమావేశానికి రామన్నపేట సిఐ ఎం రవి హాజరయ్యా రు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిలాద్ ఉన్ నబి పండుగనుఇలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన కోరారు ఈ పండుగ విషయంలో మత పెద్దలు ప్రజలు సహకరించాలని సిఐ కోరారు అలాగే శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని అన్నారు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మతసామరస్యాన్ని పాటిస్తూ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో హిందూ ముస్లింమదపెద్దలు ప్రజా ప్రతినిధు లు శాంతి కమిటీ సభ్యు లు పాల్గొన్నారు

# ప్రమాదకర కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేయాలి

* జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రమాదకర కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ లోని వీసీ మీటింగ్ హాల్‌లో ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి, కార్మిక శాఖ, ఫైర్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పాల్గొన్నారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ రసాయన, ఔషధ పరిశ్రమల్లో ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదాల కారణంగా విలువైన మానవ ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పరిశ్రమల యాజమాన్యాలు ముందస్తు భద్రతా చర్యలను కట్టుదిట్టంగా చేపట్టాలని సూచించారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.జిల్లాలోని అన్ని ప్రమాదకర కర్మాగారాల్లో థర్డ్ పార్టీ సేఫ్టీ కన్సల్టెంట్ ద్వారా భద్రతా ధృవీకరణ పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత కర్మాగారాల యాజమాన్యాలు తమ పరిశ్రమల్లో గుర్తించిన భద్రతా లోపాలపై చేపట్టిన చర్యలకు సంబంధించిన వర్తింపు నివేదిక ను 10 రోజుల్లోగా సమర్పించేలా చూడాలని ఆదేశించారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై తనిఖీలు నిర్వహించగా గుర్తించిన లోపాలను యాజమాన్యాలు తక్షణమే సరిచేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఫ్యాక్టరీల్లో డ్రైర్లు, రియాక్టర్లు, పేలుడు ఉపశమన ప్యానెల్స్, భద్రతా వాల్వులు తదితర భద్రతా పరికరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసి, అవి సక్రమంగా పనిచేస్తున్నాయో నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని రసాయన పరిశ్రమల్లో వారం రోజుల్లోగా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నమూనాలు (Samples) సేకరించి, సంబంధిత ప్రమాణాల ప్రకారం పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ నిబంధనలు, కాలుష్య నియంత్రణ ప్రమాణాలు కచ్చితంగా అమలయ్యేలా పీసీబీ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పరిశ్రమల యాజమాన్యాలు నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ కార్మికులు, పరిసర ప్రాంత ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు, కార్మికుల ప్రాణ రక్షణ విషయంలో ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడదని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, జిల్లా పరిశ్రమలు అధికారి రవీందర్,సంబంధిత శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ లక్ష గొంతుకల పొలికేక నిర్వహించిన ఈగ దయాకర్ గుప్త



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: బుల్లెట్ రైలు సాధన సమితి ఇచ్చిన పిలుపుమేరకు విద్యా నగర్ లోని జైశ్రీరామ్ సాయి అపార్ట్‌మెంట్ ముందు మంగళవారం సాయంత్రం 7 గంటలకు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ ఈసీ మెంబర్, లయన్స్ ఐ హాస్పిటల్ జాయింట్ సెక్రటరీ ఈగ దయాకర్ గుప్త ఆధ్వర్యంలో అపార్ట్‌మెంట్ వాసులు సూర్యాపేటకు బుల్లెట్ రైలు రావాలని పొలికేక కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈగ దయాకర్ గుప్తా మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు అయినప్పటికీ సూర్యాపేట ప్రజల చిరకాల కోరిక అయిన రైల్వే లైను రాకపోవడం విచారకరమని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల రాజధానులకు మధ్యలో ఉన్న సూర్యాపేటకు జాతీయ రహదారి 65కు సమాంతరంగా రైల్వే లైను, రైల్వే కారిడారు ఏర్పాటు చేయాలని, గతంలో ప్రకటించిన విధంగా శంషాబాద్ చెన్నై బుల్లెట్ ట్రైన్ ను సూర్యాపేట, అమరావతి మీదుగా నడపాలని వారు కోరారు . బుల్లెట్ ట్రైన్ వస్తే సూర్యాపేట విద్యా వైద్య వాణిజ్య పరంగా గణనీయమైన అభివృద్ధిని సాధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపార్ట్ మెంట్ వాసులు మిర్యాల శివకుమార్, హనుమండ్ల పిచ్చిరెడ్డి ,పున్నారావు, నరేష్, శ్రీనివాస్, విజయలక్ష్మి, మిర్యాల కవిత, పుష్ప, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన తెలంగాణ పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు

* విజేత కే నాగరాజు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ లో మంగళవారం నిర్వహించిన తెలంగాణ పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఎన్నికల నిర్వహణ అధికారిగా సీఐ మన్మధ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియను ప్రశాంతమైన, పారదర్శకమైన వాతావరణంలో నిర్వహించారు. ఎన్నికల్లో అర్హత కలిగిన పోలీస్ సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకుని ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఐదుగురు అభ్యర్థులు పోటీ పడగా, మొత్తం 32 ఓట్లకు గానూ, కె. నాగరాజు 16ఓట్లు సాధించి, విజయం సాధించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియ మొత్తం విజయవంతంగా పూర్తయింది.

## పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

* హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఒకటవ వార్డ్ లో వన మహోత్సవం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి పాల్గొని మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి పెంచడం ద్వారా భవిష్యత్ తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలు, రహదారుల వెంట మరియు ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. హుస్నాబాద్ పట్టణాన్ని పచ్చదనం , పరిశుభ్రతలో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో వైస్ చైర్ పర్సన్ పద్మ ,ఎఫ్ ఆర్ ఓ సిద్ధార్థ్,కౌన్సిలర్స్ అనూష లత తిరుపతి బొలిశెట్టి రాజు సంపత్ ,మంజుల వరప్రసాద్ రమేష్, వైద్యం కిరణ్ ప్రసాద్ స్వరూప, కో ఆప్షన్ సభ్యులు గ్లోరినా, ప్రజా ప్రతినిధులు మున్సిపల్ అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు

* సెప్టెంబరు 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : జిల్లాలోని వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఉచితంగా కుట్టుమిషన్లు అందించనుంది. ఇందుకోసం అర్హులైన మహిళల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి తెలిపారు. అర్హులు http://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా సెప్టెంబరు 15లోగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు కులం, ఆదాయం, నివాసం, ఆధార్, రేషన్ కార్డు, విద్యార్హతలు, బ్యాంకు ఖాతా తదితర ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. మహిళల వయసు 18 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలి. నిరుద్యోగులు, పేదలు, నిరాశ్రయులు, బీసీ వర్గాలకు చెందిన మహిళలకు ప్రాధాన్యం ఉంటుంది. తెల్ల రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు ఉండాలి, కుటుంబ వార్షిక ఆదాయం ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండాలి. కుట్టుమిషన్ శిక్షణ పొందిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీసీ కుల వృత్తుల పథకం కింద లబ్ధి పొందిన వారు అనర్హులు, గతంలో ప్రభుత్వ పథకాల ద్వారా కుట్టుమిషన్ పొందిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులు. అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సెప్టెంబరు 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కోరారు.

## విద్యార్థుల ప్రవర్తన పై నిరంతరం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

* ఉపాధ్యాయులను ఆదేశించిన జిల్లా కలెక్టర్



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : విద్యార్థుల చదువులు, ప్రవర్తనపై వార్డెన్లు, ఉపాధ్యాయులు నిరంతరం ప్రత్యేక శ్రద్ధ వహించాలని అనిల్ అనిల్ అట ఆదేశించారు. విద్యార్థులు చెడు అలవాట్లు, వ్యసనాలకు బానిస కాకుండా వారిని ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన అవగాహన కల్పించాలని చెప్పారు. విద్యార్థుల మానసిక పరిస్థితిని గమనిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.మంగళవారం తన ఛాంబర్‌లో జిల్లా ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, ఆర్‌సీఓలు, ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వార్డెన్లు, ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేయాలని అన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు కనిపించినా, వారు ఏమైనా చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నా వెంటనే గుర్తించి తగిన విధంగా కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. కిటికీలు, తలుపులు, ఎలక్ట్రికల్ ఫ్యాన్లు, గ్యాలరీలకు సంబంధించిన పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. దేవరకొండ హాస్టల్‌లో నీటి సమస్య ఉందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి విద్యార్థులకు నీటి సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు తక్కువగా ఉన్నందున నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, హాస్టళ్లలో విద్యార్థులకు కూడా నీటి సంరక్షణపై అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అధికారులు సమన్వయంతో పనిచేసి హాస్టళ్లు, పాఠశాలల్లో మిగిలిన అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డి డి శశికళ, బీసీ సంక్షేమ అధికారి సంజీవ,మైనార్టీ కార్పొరేషన్ అధికారి విజయేందర్ రెడ్డి , పంచాయత్ రాజ్ అధికారి గిరిధర్,మిషన్ భగీరథ డి ఈ శాంతకుమారి,ఆర్ సి ఓ లు, ఇంజనీర్లు హాజరయ్యారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: పర్యావరణ పరిరక్షణతో పాటు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ హరి సింగ్, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది పిలుపునిచ్చారు. పట్టణంలో నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు కలెక్టర్ హరి సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ హరి సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వనమహోత్సవ కార్యక్రమాలను జిల్లాలోని ప్రతి పట్టణం, ప్రతి గ్రామంలో విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది మాట్లాడుతూ మొక్కలు నాటడం మాత్రమే కాకుండా అవి పెరిగే వరకు సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి, వైస్ చైర్మన్ షఫీవుల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు నాగుల వాసు, గండూరి రమేష్, స్థానిక కౌన్సిలర్ కొణతం రాజేష్‌రెడ్డి, ఈఈ కిరణ్, డీఈ ప్రణయ్ రెడ్డి,మేనేజర్ బుచ్చి బాబు ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ యాదగిరి, జూనియర్ అసిస్టెంట్లు అజిముద్దీన్ ఎస్ఎస్ఆర్ ప్రసాద్, వన మహోత్సవం ఇంచార్జ్ లు వసుంధర,వసీం తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల వద్ద బెల్ట్ షాపులు తొలగించాలి

* జిల్లా ఎస్పీకి ఏఐఎస్ఎఫ్ నాయకుల ఫిర్యాదు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : విద్యాసంస్థలు, బాలికల హాస్టళ్లు, దేవాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో కొనసాగుతున్న బెల్ట్‌షాపులను వెంటనే తొలగించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.భూపాలపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్టీ బాలికల కళాశాల హాస్టల్, ఆశ్రమ పాఠశాల, సాయిబాబా ఆలయం, శివాలయం, ప్రభుత్వ ఆసుపత్రి తదితర ప్రాంతాల సమీపంలో సుమారు పది బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ ఆరోపించారు. విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు, మహిళలు, ఆలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలిగేలా బహిరంగంగా మద్యం విక్రయాలు జరగడం సరికాదన్నారు. విద్యాసంస్థలు, బాలికల హాస్టళ్ల సమీపంలోని బెల్ట్‌షాపులను జిల్లా పోలీసు, సంబంధిత అధికారులు తక్షణమే తొలగించాలని కోరారు. అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఏఐ ఎస్ఎఫ్ జిల్లా నాయకులు పంగ మహేందర్, బొల్లం తిరుపతి, రాజుల శివ, ఉల్లేరావు బన్నీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం

ప్రజాస్ఫూర్తి , నల్లగొండ : నల్లగొండ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.బీసీ విద్యార్థి సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు.ఈ సందర్భంగా అయితగోని జనార్ధన్ గౌడ్ మాట్లాడుతూ,కంచర్ల భూపాల్ రెడ్డి కి భగవంతుడు ఆయురారోగ్యాలు, నిండు నూరేళ్ల జీవితం, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో ఆయన మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని, నల్గొండ నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఆయనకు ఉండాలని కోరుకున్నారు.నిత్యం నల్గొండ నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకొని, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ప్రజా నాయకుడు కంచర్ల భూపాల్ రెడ్డి గారి జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని జనార్ధన్ గౌడ్ తెలిపారు.

## పారదర్శకంగా అంగన్వాడి టీచర్ పోస్టుల భర్తీ

* పైరవీలకు ఎలాంటి తావులేదు
* ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి, లింగాల సుశీల.



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ మండలంలో వివిధ గ్రామాలలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు భారీగా దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తులను స్వీకరిస్తూ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని హుస్నాబాద్ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ లింగాల సుశీల అన్నారు.ఈ అంగన్వాడి పోస్టులలో ఎలాంటి పైరవీలకు తావు లేవని అన్ని పోస్టులను అధికారులే పారదర్శకంగా ఎంపిక చేస్తారని,దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు స్థానికంగా ఉన్నారా లేరా అని తేల్చుకున్నాకే వారి విద్యారాతను బట్టి అంగన్వాడీ టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని ఆమె అన్నారు. హుస్నాబాద్ మండలంలో భారీగా దరఖాస్తులు వచ్చాయని వాటిలో హుస్నాబాద్ టౌన్ లో ఒక పోస్టుకు 98 దరఖాస్తులు,పుల్ నాయక్ తండ అంగన్వాడి సెంటర్ కు 22 దరఖాస్తులు, మీర్జాపూర్ సెంటర్ కు 29 దరఖాస్తులు, రాముల పల్లె సెంటర్ కు ఆరు దరఖాస్తులు, కుచనపల్లి సెంటర్ కు 22 దరఖాస్తులు బళ్ళు నాయక్ తండ అంగన్వాడి హెల్పర్ కు 13 దరఖాస్తులు వచ్చాయని ఆమె అన్నారు. ఇవన్నీ దరఖాస్తులను ఈనెల 27 వరకు పరిశీలిస్తామని ఆమె తెలిపారు.

## జన్నారం ఐటీఐలో 3వ దశ ప్రవేశాలకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలి



ప్రజాస్ఫూర్తి , జన్నారం : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలు, ఏటీసీల్లో 3వ దశ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు జన్నారం ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీ కళాశాల ప్రిన్సిపల్ వై. రమేష్ మంగళవారం రోజున ఒక ప్రకటన లో తెలిపారు. కాగా అర్హులైన విద్యార్థులు ఈ నెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గత రెండు దశల్లో దరఖాస్తు చేసుకుని సీటు రాని విద్యార్థులు నేరుగా వాక్ఇన్ ప్రవేశాలకు హాజరు కావచ్చన్నారు. మిగతా వివరాలకు జన్నారం ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీ కళాశాలలో సంప్రదించాలన్నారు.

## అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలి

* పోనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : పొన్కల్ గ్రామ ప్రజలందరూ పెన్షన్ కు అర్హులైన వారు పెన్షన్ కు దరఖాస్తు చేసుకోవడం కోసం ఈ నెల 31వ తేదీ దరఖాస్తులకు చివరి తేదీ. కావున, ఇప్పటివరకు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోని అర్హులైన వారు ఉంటే త్వరగా దరఖాస్తు చేసుకోవలసిందిగా మంగళవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో తెలిపారు. కావున అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

## ఫీజుల బకాయి–బీజేపీ లడాయి




ప్రజా స్ఫూర్తి,భైంసా: రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతోంది.విద్యార్థుల కోసం దీక్ష చేసేందుకు కనీసం అనుమతి ఇవ్వకుండా ప్రభుత్వం అడ్డంకులు సృష్టించినా——బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు బీజేపీ రాష్ట్ర కార్యాలయ ప్రాంగణంలోనే రెండు రోజుల నిరాహార దీక్షలో బీజేపీ నిర్మల్ జిల్లా నాయకులు భూమయ్య, రవిపాండే, నారాయణ రెడ్డి, పడిపల్లి గంగాధర్, జిల్లా కార్యదర్శి తాడేవార్ సాయినాథ్, సాధు ప్రభాకర్, పండిత్ జాదవ్ తో కలిసి సంఘీభావం తెలిపారు. విద్యార్థులకు న్యాయం జరిగి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా చెల్లించే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుంది

# పేదల సంక్షేమమే ధ్యేయం

* **గోరి కొత్తపల్లి మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజా స్ఫూర్తి : పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం కొత్తపల్లి గోరి మండలంలోని సుల్తాన్‌పూర్, కొత్తపల్లి గోరి, చిన్నకోడెపాక గ్రామాల్లో రైతు వేదికల వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఆహార భద్రత కల్పించాలనే ఉద్దేశంతో స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తోందన్నారు. కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతాయని పేర్కొన్నారు.

**మహిళా సంఘాలకు భవనాలు**

జగ్గయ్యపేట, సుల్తాన్‌పూర్, గోరుకొత్తపల్లి, చిన్నకోడెపాక, చెన్నాపూర్ గ్రామాల్లో మహిళా సంఘాలకు సంబంధించిన వీవో భవనాల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మహిళల ఆర్థిక సాధికారతలో స్వయం సహాయక సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. భవనాల నిర్మాణంతో మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ, ఆర్థిక కార్యకలాపాలకు అనువైన వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలు, రైతులు, పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటుదాం.... పర్యావరణాన్ని కాపాడుదాం

* **ఎంపీడీవో సిహెచ్. సుభాషిణి**



కొత్తగూడెం , ప్రజాస్ఫూర్తి : విద్యానగర్ కాలనీ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్. సుభాషిణి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని కాపాడవచ్చు అని , నేటి మొక్కే రేపటి తరాలకు జీవనాధారం అని ఆమె అన్నారు . అనంతరం కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలిసి విరివిగా మొక్కలు నాటుతూ వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా విద్యార్థులపై ఉందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సంధ్య , కాలేజ్ ప్రిన్సిపల్ రమేష్ , విద్యానగర్ కాలనీ ఉపసర్పంచ్ వాసిరెడ్డి మురళి , వార్డు మెంబర్ రజిత ,పంచాయతీ ఈవో కె. వెంకటేశ్వర్లు , పంచాయతీ గుమస్తా రామకృష్ణ , బిల్ కలెక్టర్లు అమర్ నాథ్ , బోస్ , సురేష్ ,కిషోర్ , పిచ్చయ్య , శానిటేషన్ సూపర్వైజర్ దుర్గాప్రసాద్ , కళాశాల సిబ్బంది తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు .

# విద్యుత్ షాక్‌తో మహారాష్ట్ర కార్మికుడు మృతి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజా స్ఫూర్తి: విద్యుత్ తీగలు లాగే పనిలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మహారాష్ట్రకు చెందిన కార్మికుడు మృతి చెందిన ఘటన చిట్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం....మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా గోందుపిప్రి మండలం నందవర్ధన్ గ్రామానికి చెందిన తామ్మేశ్వర్ పత్రోజీ, అతని సోదరుడు సచిన్ పత్రోజీతో పాటు మరికొందరు కార్మికులు గత ఎనిమిదేళ్లుగా ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ తిప్పారపు ప్రశాంత్ వద్ద విద్యుత్ స్తంభాలపై వైర్లు లాగే పనులు చేస్తున్నారు.మంగళవారం ఉదయం చిట్యాల గ్యాస్ గోదాం సమీపంలోని సైట్‌లో విద్యుత్ స్తంభంపైకి ఎక్కిన తామ్మేశ్వర్ వైరు కట్ చేస్తుండగా.. ప్రమాదవశాత్తు ఆ వైరు పక్కనే ఉన్న విద్యుత్ లైన్‌కు తగిలింది. దీంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురైన తామ్మేశ్వర్ స్తంభం నుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు.తోటి కార్మికులు వెంటనే అతడిని ఆటోలో చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి సోదరుడు సచిన్ పత్రోజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపారు.

# తాజ్‌పూర్ గ్రామంలో ఘనంగా వనమహోత్సవం



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : భువనగిరి మండలంలోని తాజ్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. వనమహోత్సవం సందర్భంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, అవి పెద్ద చెట్లుగా ఎదిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని అన్నారు. ప్రజలందరూ వనమహోత్సవ కార్యక్రమంలో భాగస్వాములను చేసి, ప్రతి ఇంట్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంతో పాటు గ్రామాల పరిసరాలు ఆహ్లాదకరంగా మారుతాయని పేర్కొన్నారు.అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి సుధాకర్ రెడ్డి, జడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్, తాజ్పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్, గ్రామ పంచాయతీ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శివారు ప్రాంతాలు, మున్సిపాలిటీ విలీన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించి దశలవారీగా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని 14వ వార్డులోని స్నేహ నగర్ మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. హనుమంత రెడ్డి తో కలిసి వారు కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో శివారు ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వర్షం నీరు ఖాళీ స్థలాలలో నిల్చుండటం వలన దోమలు వస్తుండటంతో, పిల్లలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, త్వరలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మెయిన్ సమస్యను కు పరిష్కరిస్తామని, తాత్కాలికంగా నీటి నిలువ ఉండకుండా ఇరిగేషన్ వారితో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని తెలిపారు. ఖాళీ స్థలం యజమానులకు సమాచారం ఇచ్చి నీళ్లు నిలువ ఉండకుండా శుభ్రం చేసుకోవాలి తెలిపారు. స్నేహ నగర్ కాలనీ వాసుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, వార్డు కౌన్సిలర్ గాలి సాయికిరణ్, కాంగ్రెస్ పార్టీ వార్డు ఇంచార్జ్ , పంతంగి దశరథ, నాయకులు ఎలిమినేటి అభినయ్, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, వీరన్న నాయక్, కౌన్సిలర్ లు గుణగంటి హేమ సతీష్, చిలుముల సునీల్ రెడ్డి, నాగుల వాసు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# వనమహోత్సవంలో ఎమ్మెల్యే జీఎస్సార్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : 'మన అడవి-మన భవిష్యత్తు.. పచ్చదనం పెంచడం-ప్రాణాలను కాపాడుదాం' అనే నినాదంతో రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలోని బుగులోని దేవాలయం సమీపంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి మానవాళికి అందించిన అమూల్యమైన వరమని, చెట్లు, అడవులు జీవనానికి ప్రాణాధారమని అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి పెంచాలని సూచించారు.తెలంగాణ ప్రభుత్వం పచ్చదనం పెంపునకు అనేక కార్యక్రమాలు చేపడుతోందని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకు మొక్కల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకుని మొక్కల సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సమస్యను సత్వరమే పరిష్కరించిన మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ పట్టణంలోని 15వ వార్డులో బోరు వినియోగంలోకి తీసుకుని రావాలని స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ సమస్యను స్థానికులు మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్య పై వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ వెంటనే స్పందించారు. మంగళవారం 15వ వార్డులో పర్యటించి వినియోగానికి వీలు లేకుండా ఉన్నటువంటి బోరు ను పరిశీలించారు. అనంతరం సంబంధిత మున్సిపల్ సిబ్బందితో మాట్లాడడంతో మరమ్మతు పనులు చేపట్టి బోరు ను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చారు. బోరు మరమ్మతులు పూర్తవడంతో స్థానిక ప్రజలకు నీటి సమస్యనుంచి ఉపశమనం లభించింది. తమ సమస్యను వైస్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి, ఆలస్యం చేయకుండా మరమ్మతులు చేయించడం పట్ల 15వ వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఈ సందర్భంగా దొంతి నరేష్ గౌడ్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటిని సంబంధిత అధికారుల సహకారంతో సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. బోరు మరమ్మతులు చేయించి నీటి సమస్యను పరిష్కరించడంతో స్థానికులు మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# అభ్యర్థులకు ఉచిత సెమీ రెసిడెన్షియల్ కోచింగ్: ఎస్పీ



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు ఉద్యోగాల కొరకు ప్రయత్నించే అభ్యర్థులకు ఉచిత సెమీ రెసిడెన్షియల్ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని పేద, గ్రామీణ, గిరిజన మరియు మారుమూల ప్రాంతాలకు చెందిన యువతి, యువకులకు నాణ్యమైన శిక్షణ అందించి పోలీసు ఉద్యోగాలకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కోచింగ్‌లో భాగంగా అనుభవజ్ఞులైన అధ్యాపకులచే రాత పరీక్షలకు సంబంధించిన శిక్షణతో పాటు, పోలీసు అధికారుల పర్యవేక్షణలో ఫిజికల్ ట్రైనింగ్ ఉచితంగా అందించబడుతుందని తెలిపారు. అభ్యర్థులకు మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పించబడుతుందని చెప్పారు. పోలీసు శాఖలో చేరాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 26వ తేదీ నుండి 31వ తేదీ వరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇవ్వబడిన దరఖాస్తు ఫారాన్ని పూర్తి వివరాలతో నింపి, విద్యార్హతలకు సంబంధించిన స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను జతచేసి సమర్పించాలని సూచించారు. మహిళా అభ్యర్థులు కూడా ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, అర్హులైన, ప్రతిభావంతులైన అభ్యర్థులను పారదర్శకంగా ఎంపిక చేసేందుకు సెప్టెంబర్ 6వ తేదీన కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లందు, భద్రాచలం, మణుగూరు పట్టణాలలో ప్రత్యేక స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించబడుతుందని వివరించారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు కోచింగ్ ప్రారంభ తేదీ, శిక్షణా కేంద్రం, ఇతర పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని వెల్లడించారు. ఇతర వివరాల కోసం ఎస్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, 8712682013ను సంప్రదించాలని కోరారు.

## జిల్లా కారాగారంలో హైదరాబాద్ రేంజ్ డీఐజీ డా. దుద్దిళ్ల శ్రీనివాస్ తనిఖీ




ప్రజాస్ఫూర్తి, నల్గొండ: నల్గొండ జిల్లా కారాగారాన్ని సాధారణ తనిఖీలలో భాగంగా హైదరాబాద్ రేంజ్ డీఐజీ డాక్టర్ దుద్దిళ్ల శ్రీనివాస్ సందర్శించి, కారాగారంలో ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, సంక్షేమ కార్యక్రమాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ కి కారాగారం పర్యవేక్షణ అధికారి కూన ఆనందరావు జిల్లా ఉప కారాగారాల పర్యవేక్షణ అధికారి శోభన్ బాబు పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. తనిఖీలో భాగంగా డీఐజీ గారు ఖైదీలకు అందుతున్న ఆహారం, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్యం, భద్రతా చర్యలు, జైలు పరిసరాల నిర్వహణతో పాటు ఖైదీల సంక్షేమం పునరావాసానికి అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను పరిశీలించారు. ఖైదీలలో పరివర్తన తీసుకురావడానికి చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. కారాగారంలో భద్రతా ప్రమాణాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, ఖైదీల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహిస్తున్న పర్యవేక్షణ అధికారి శ్రీ కూన ఆనందరావు సిబ్బందిని డీఐజీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జైలర్లు బాలకృష్ణ, అచ్చయ్యతో పాటు కారాగార సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీ సభ్యులు గ్రామ అభివృద్ధి కోసం పని చేయాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు మరియు కమిటీ సభ్యులు ఉంద్రుగొండ గ్రామ అభివృద్ధి కోసం పనిచేయాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. చివ్వెంల మండలం ఉంద్రుగొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులు , కమిటీ సభ్యులు గ్రామ సర్పంచ్ గుడిసె రామకృష్ణ ఆద్వర్యంలో మంగళవారం నాడు వైట్ హౌస్ లో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని మర్యాపూరకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీ అధ్యక్షులు మామిడి మల్లయ్య మరియు సభ్యులకు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ని పటిష్టం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అందజేయడంలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చివ్వెంల మండల పార్టీ అధ్యక్షులు దరావత్ వీరన్న నాయక్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మామిడి మల్లయ్య, ఉపాధ్యక్షులు దోనేటి కార్తీక్, కార్యదర్శి గుడిసె యల్లయ్య, కోశాధికారి చింతల మురళి, ఆర్గనైజర్ అంబటి కోటయ్య, సభ్యులు దాసరి సాయిలు, గుడిసె లింగయ్య , దాసరి లింగయ్య, అంబటి సైదులు, గుడిసె బిక్షం, గొడుగు సైదులు, పల్లేటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# గరిడేపల్లి లో ఘనంగా వన మహోత్సవం



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండల కేంద్రమైన గరిడేపల్లి లో మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా గరిడేపల్లి సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలన్నారు పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు మొక్కలను మాత్రమే కాకుండా నాటిన ప్రతి మొక్కలు పరిరక్షించాలన్నారు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలన్నారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ చత్రూ నాయక్ పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు ఉప సర్పంచ్ మాతంగి సంజీవ టెక్నికల్ అసిస్టెంట్ శిరీష ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరిత వార్డు మెంబర్లు కర్నే అరుణ కుక్కునూరు సైదులు చిక్కుల మట్టయ్య వన సేవకులు కానుగుపద్మ మండ వ శాంత మేకపోతుల నరేష్ కానుగు సాయమ్మ రమణ తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన నోడల్ అధికారి సురేష్ రెడ్డి



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలను యాదాద్రి భువనగిరి జిల్లా నోడల్ అధికారి బి.సురేష్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగాకళాశాల విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, గంజాయి, మద్యము, సెల్ఫోన్ బైక్ రైడింగ్, మొదలగు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా, చదువుపై శ్రద్ధ వహించాలని ఆయన అన్నారు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నోట్ బుక్స్ ను కళాశాలలోని ప్రతి విద్యార్థికి 12 ఉచిత నోటు బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నరేందర్ రెడ్డి అధ్యాపకులు పరశురాములు, గణేష్, వెంకట చారి మురళి భిక్షం సురేష్ కృష్ణ స్వప్న, మృదుల, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అలా ప్రకృతిలో ఒడిలో...

# ఓ వీకెండ్

కొందరికి సమ్మర్ టూర్లంటే ఇష్టం. మరికొందరికి మాన్‌సూన్ టూర్లంటే ఇష్టం ఉంటుంది. కానీ, టైం మాత్రం ఉండదు. అందుకే చాలామంది వీకెండ్ టూర్లు ప్లాన్ చేస్తుంటారు. అందుకోసం దగ్గరగా ఉండే ప్రదేశాలను ఎంచుకుంటారు. ఆ లిస్ట్‌లో ఈ జలపాతాలు కూడా ఉన్నాయి. అవేంటో ఒకసారి చూసేయండి.




### మల్లెల తీర్థం

శ్రీశైలానికి 58 కిమీల దూరంలోని నల్లమల్ల అడవుల్లో ఉంది మల్లెల తీర్థం జలపాతం. ఇది హైదరాబాద్‌కు 170 కిమీల దూరంలో ఉంది. ఈ జలపాతంలో స్నానాలు చేయాలంటే దాదాపు 250 మెట్లు దిగి కిందికి వెళ్లాలి. వర్షా కాలంలో ఈ ప్రాంతం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. అయితే, నీటిలో దిగడం ప్రమాదకరం!




### కవ్వాల్ వైల్డ్ లైఫ్ సాంక్చురీ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రకృతి రమణీయత గల ఎన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. కుంతల రాజ్యం నాటి కుంటాల జలపాతం, బోథ్ పొచ్చెర జలపాతం, కవ్వాల్ వైల్డ్ లైఫ్ సాంక్చురీ జంగల్ సఫారీ, బాసర సరస్వతి దేవాలయం, శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్, నిర్మల్ కొయ్యబొమ్మలు మొదలైనవి ఎన్నో చూడవచ్చు. హైదరాబాద్ నుంచి సుమారు 250 కిలోమీటర్ల పరిధిలో ఈ పర్యాటక ప్రదేశాలున్నాయి. ఇక్కడికి చేరుకోడానికి ప్రసిద్ధ నేషనల్ హైవే 44తో విశాలమైన రోడ్డు కనెక్టివిటీ ఉంది.




### ఎత్తిపోతల జలపాతం

ఇది నగరానికి 173 కిమీల దూరంలో ఉంది. నాగార్జున సాగర్ నుంచి 14 కిమీలు ప్రయాణిస్తే ఎత్తిపోతల వస్తుంది. కృష్ణానది ఉపనది అయిన చంద్రవంక నది 70 అడుగుల ఎత్తు నుంచి దూకుతూ ఆశ్చర్యంలో ముంచెత్తుతుంది. వర్షకాలంలో ఈ జలపాతం చాలా వేగంగా ప్రవహిస్తుంది. ఇక్కడ స్నానాలు చేయడం ప్రమాదకరం.




### భీముని పాదం జలపాతం

హైదరాబాద్‌కు 200 కిమీల దూరంలో వరంగల్ జిల్లాలోని గూడూరు మండలం.. సీతానాగారం సమీపంలో ఈ జలపాతం ఉంది. వరంగల్ నుంచి 51 కిమీల దూరంలో ఉన్న ఈ జలపాతం ఆహ్లాదకరంగా, ఆకర్షనీయంగా ఉంటుంది. ఇక్కడ అన్ని కాలాల్లో నీరు ఉంటుంది.



# రెండింటికీ ఒకటే సొల్యూషన్



రోజ్ వాటర్ అంటే గులాబీ రేకుల నుంచి తయారయ్యే నీరు. ఈ వాటర్‌ని సౌందర్యసాధనంగా వాడతారు. ఇప్పటికే చాలామంది రోజ్ వాటర్ చర్మానికి వాడుతూనే ఉండొచ్చు. అయితే, దీనివల్ల జుట్టుకు కూడా చాలా మేలు జరుగుతుందని తెలుసా! అవును.. రోజ్ వాటర్‌తో చర్మానికే కాదు.. జుట్టు సమస్యలకు కూడా చెక్ పెట్టేస్తుంది. అదెలాగో తెలుసుకుందాం.

### చర్మానికి :

రోజ్ వాటర్ నేచురల్ హైడ్రేటర్‌గా పనిచేస్తుంది. ఇది చర్మం పొరల లోతుల్లోకి వెళ్లి, కాంతివంతంగా చేస్తుంది. అంతేకాదు.. ఇందులో యాంటీ ఇన్ ఫ్లమేటరీ ప్రాపర్టీలు కూడా ఉన్నాయి. అవి చర్మం మీద దురద, దద్దుర్లు, మచ్చలు, డెర్మటైటిస్, ఎగ్జిమా వంటివాటిపై ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. అలాగే రోజ్ వాటర్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు స్కిన్ సెల్స్ డ్యామేజ్ కాకుండా సంరక్షిస్తుంది. వయసు పెరిగిన ఆనవాళ్లను తెలియకుండా చేస్తుంది. ముడతలు కనపడకుండా చేస్తుంది. ఇవే కాకుండా.. రోజ్ వాటర్ పీహెచ్ స్థాయిలను కంట్రోల్ చేయడంలో సాయంచేస్తుంది. దాంతో ఆయిల్ ఎక్కువగా ఉత్పత్తి కాకుండా కంట్రోల్ చేస్తుంది. ఇందులో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ ప్రాపర్టీస్ గాయాలను మాన్పేందుకు తోడ్పడుతుంది. ఎఫెక్ట్ అయిన ప్రాంతంలో ఇన్ ఫెక్షన్ కాకుండా శుభ్రంగా ఉంచుతుంది.

### ఎలా వాడాలంటే..

చర్మానికి రోజ్ వాటర్‌ని టోనర్‌లా వాడాలి. ఎక్కడైతే అప్లయ్ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంతాన్ని ముందుగా శుభ్రం చేయాలి. తర్వాత కాటన్ పాడ్ తో అప్లయ్ చేయాలి. అలాగే దీన్ని మేకప్ రిమూవర్‌గా కూడా వాడొచ్చు. అందుకోసం కొబ్బరి నూనెలో రోజ్ వాటర్ వేసి కలపాలి. దాంతో ఎఫెక్టివ్ మేకప్ రిమూవర్‌గా పనిచేస్తుంది. అంతేకాదు.. స్ప్రేలా కూడా వాడొచ్చు. రోజ్ వాటర్‌ని స్ప్రే బాటిల్‌లో పోసి ముఖంపై స్ప్రే చేయాలి. దీంతో మేకప్ చూడ్డానికి ఫ్రెష్‌గా కనిపిస్తుంది. ఇవేకాకుండా రోజ్ వాటర్‌ని తేనె, పెరుగు వంటివాటితో కలిపి ఫేస్ మాస్క్‌లా కూడా వాడొచ్చు. మచ్చలు పడతాయనిపిస్తే ఆ చోట రోజ్‌వాటర్‌ని నేరుగా అప్లయ్ చేయొచ్చు. ఇది వాడటం వల్ల మొటిమలు రావు.

### జుట్టుకి

జుట్టుకి రోజ్ వాటర్ వాడితే మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. మృదువుగా, మెరిసేలా చేస్తుంది. చుండ్రుని తగ్గిస్తుంది. కుదుళ్లకు బలాన్నిస్తుంది. పుర్రె భాగంలో పీహెచ్ స్థాయిలను బ్యాలెన్స్ చేస్తుంది. దాంతో ఆయిల్ ప్రొడక్షన్ ఎక్కువ కాకుండా చేస్తుంది. నేచురల్ సెంట్‌లా కూడా పనిచేస్తుంది.

### ఇలా వాడాలి

షాంపూ, కండిషనర్ వాడిన తర్వాత చివరిగా రోజ్ వాటర్ తో కడగాలి. పుర్రె భాగానికి రోజ్ వాటర్‌ని నేరుగా అప్లయ్ చేసి మర్దన చేయాలి. అలా చేస్తే చుండ్రు తగ్గుతుంది. జుట్టు పెరగడానికి ఉపయోగపడుతుంది. అలాగే రోజ్ వాటర్‌ని స్ప్రే బాటిల్‌లో పోసి రోజంతా హెయిర్ మిస్ట్‌గా వాడొచ్చు. రోజ్ వాటర్ కొన్ని చుక్కలు రెగ్యులర్‌గా వాడే కండిషనర్‌లో వేసుకుంటే మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. అంతేకాదు.. రోజ్ వాటర్‌ని గ్లిజరిన్‌తో కలిపి వాడితే, మాయిశ్చర్‌లా కనిపిస్తుంది. జుట్టు మెరిసేలా చేస్తుంది.



# బ్రేకప్ తర్వాత...

ఈ రోజుల్లో ప్రేమలో పడడం చాలా సహజం. కానీ, అన్ని ప్రేమలూ విజయవంతం కావు. కొన్ని మధ్యలోనే బ్రేక్ అవుతాయి. అయితే, బ్రేకప్ తర్వాత లైఫ్‌లో ఎలా ముందుకెళ్లాలో, మునుపటిలా లైఫ్‌ని ఎలా లీడ్ చేయాలో అర్థంకాక డైలమాలో ఉంటారు. కొందరు ఈ స్టేజీలోనే డిప్రెషన్‌కి కూడా గురవుతుంటారు. మరి దీనికి సొల్యూషన్ ఏంటి? బ్రేకప్ తర్వాత నార్మల్ లైఫ్ లీడ్ చేయాలంటే ఏం చేయాలి? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవే.

1. బ్రేకప్ తర్వాత మాజీ ప్రేమికులతో కాంటాక్ట్ ఉండకూడదు. మెసేజ్, ఫోన్ కాల్, సోషల్ మీడియా ద్వారా గానీ.. ఎలాంటి కమ్యూనికేషన్ మెయింటెయిన్ చేయకూడదు. ఎందుకంటే.. ఏదో ఒకరకంగా ఇంటరాక్షన్ ఉంటే మీ మాజీ లవర్ పాతగాయాల్ని రేపడానికి ప్రయత్నిస్తారు. తిరిగి మిమ్మల్ని వాళ్ల లైఫ్‌లోకి రప్పించుకునేందుకు రకరకాలుగా ప్రయత్నిస్తారు. అదే కాంటాక్ట్ లేకుండా దూరంగా ఉంటే.. మనసుకు తగిలిన పాతగాయాలు త్వరగా మానిపోతాయి. అప్పుడు మీ మీద మీరు ఫోకస్ చేయగలుగుతారు. కొత్త లైఫ్ స్టార్ట్ చేస్తారు.

2. మాజీ లవర్‌కి సంబంధించిన వస్తువులు ఏమైనా ఉంటే వాటిని తీసి పారేయాలి. అది మీకు కష్టంగా, సవాలుగా అనిపించొచ్చు. కానీ అలా చేసి తీరాలి. అప్పుడు మీ చుట్టు కొత్త వాతావరణం ఏర్పడుతుంది. ఈ పని చేసేందుకు మీరు బాగా నమ్మే వాళ్ల సాయం తీసుకోండి. వాళ్లు మీకు ఎమోషనల్‌గా కూడ సపోర్ట్ చేస్తారు.

3. బ్రేకప్ వల్ల మిమ్మల్ని మీరు అర్థం చేసుకునే అవకాశం దొరుకుతుంది. పర్సనల్ గ్రోత్‌కి ఆస్కారం ఉంటుంది. ఏం జరిగింది? అనేది మీ అనుభవాల ద్వారా లోతుగా తెలుసుకునే ప్రయత్నం చేయగలుగుతారు. ఈ రిలేషన్ షిప్ నుంచి నేను ఏం నేర్చుకున్నా? అని ప్రశ్నించుకునే సమయం ఇది. మీ భావాలను, ఆలోచనలను ఒక పేపర్ మీద పెట్టండి.

4. బ్రేకప్ తర్వాత సపోర్ట్ సిస్టమ్ అనేది లేకపోతే చాలా కృంగిపోతారు. మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడండి. మిమ్మల్ని ప్రేమించేవారితో టైం స్పెండ్ చేయండి. మీకు నచ్చే యాక్టివిటీలు చేయండి. మీ ఫీలింగ్స్ ఇతరులతో షేర్ చేసుకోండి. బాధలో ఉన్నప్పుడు ఒంటరిగా అస్సలు ఉండకండి.

5. ఎమోషన్స్‌ని అణచుకోకండి. మీ భావోద్వేగాలను మీరు ఫీల్ అవ్వండి. ఏడవాలనిపిస్తే ఏడ్చేయండి. అది కోలుకోవడానికి బాగా ఉపయోగపడుతుంది. మీ కోపం, బాధ అన్నీ అందులో వెళ్లిపోతాయి. ఫీలింగ్స్ బయటపెట్టడానికి సిగ్గపడకండి.

బ్రేకప్ నుంచి కోలుకోవడం అంత ఈజీ అయితే కాదు. కానీ, ఈ చిట్కాలు పాటిస్తే మంచి రిజల్ట్ కచ్చితంగా చూస్తారు. ఒకటి మాత్రం గుర్తుపెట్టుకోవాలి. గాయం మానాలంటే.. కొంత సమయం పడుతుంది.

# MOVIE TIME



## తమన్నా మూవీకి తిప్పలు

రిలీజ్ ముగింట మిల్కీ బ్యూటీ తమన్నా బాలీవుడ్ మూవీ చిక్కుల్లో పడింది. తమన్నా, సిద్ధార్థ్ మల్హోత్రా జంటగా నటిస్తున్న 'ది వాన్' మూవీ విడుదలకు మరో నెల రోజులు ఉండగా హీరోతో పాటు నిర్మాతలతో ఏర్పడిన క్రియేటివ్ డిఫరెన్సెస్ కారణంగా దర్శకుడు ఈ సినిమా నుంచి తప్పుకున్నట్లు వార్తలొస్తున్నాయి. సెప్టెంబర్ 25న రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ ఇటీవల ప్రకటించారు. డైరెక్టర్ దీపక్ కుమార్ ఈ సినిమాను తెరకెక్కించిన తీరు పట్ల హీరో సిద్ధార్థ్ మల్హోత్రాతో పాటు ప్రొడ్యూసర్ ఎక్తా కపూర్ అసంతృప్తిగా ఉన్నారని అంటున్నారు. మేకింగ్ విషయంలో అభిప్రాయభేదాలు తలెత్తడంతో దీపక్ వైదొలిగినట్లు తెలిసింది. మేకర్స్‌పై లీగల్ ఫైట్‌కు ఆయన సిద్ధమయ్యారట. రీషూట్స్‌కు సిద్ధార్థ్ మల్హోత్రా స్వయంగా దర్శకత్వం వహించబోతున్నట్లు చెబుతున్నారు.





## నెక్స్ట్ మూవీ అనిల్‌తోనేనా?

వారణాసి తర్వాత మహేష్‌బాబు నెక్స్ట్ మూవీ డైరెక్టర్ ఎవరన్నది టాలీవుడ్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఈ లిస్ట్‌లో సందీప్ వంగాతో పాటు పలువురు అగ్ర దర్శకులు ఉన్నారు. వారందరిని కాదని అనిల్ రావిపూడికి మహేష్‌బాబు ఛాన్స్ ఇచ్చినట్లు సమాచారం. రాజమౌళి సినిమా కోసం మూడేళ్లు కేటాయించిన మహేష్‌బాబు.. నెక్స్ట్ మూవీకి అంత గ్యాప్ తీసుకోవద్దని అనుకుంటున్నారట. ఏడాదిలోపే నెక్స్ట్ మూవీని పూర్తిచేయాలని ఫిక్సైనట్లు తెలిసింది. అందుకే అనిల్ రావిపూడికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడట. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించే మూవీని 2028 సంక్రాంతికి థియేటర్లలోకి తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో ఈ మూవీపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుందని అంటున్నారు. గతంలో మహేష్‌బాబు, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో సరిలేరు నీకెవ్వరు సినిమా రాగా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది.

## 19 ఏండ్ల తర్వాత సూపర్‌స్టార్‌కు జోడీగా

సూపర్‌స్టార్ రజనీకాంత్ ధర్మన్ మూవీ నుంచి మరో సర్‌ప్రైజింగ్ అప్‌డేట్ వచ్చేసింది. ఇప్పటికే ఈ మూవీలో ముగ్గురు హీరోయిన్లు నటిస్తుండగా తాజాగా మరో సీనియర్ కథానాయిక ఇందులో భాగమైంది. దాదాపు 19 ఏళ్ల తర్వాత రజనీకాంత్‌తో శ్రియా శరణ్ జోడీ కట్టబోతుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఆర్‌ఎఫ్‌సీలో జరుగుతున్నషూటింగ్‌లో ఆమె జాయినైంది. ప్రస్తుతం రజనీ, శ్రియాతో పాటు ప్రధాన తారాగణంపై దర్శకుడు అశ్వత్ మారిముత్తు కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ గుడ్‌న్యూస్‌ను ఇన్‌స్టా ద్వారా అభిమానులతో పంచుకుంది శ్రియా. హ్యాపీ డే అంటూ రజనీకాంత్‌తో దిగిన ఓ ఫొటోను షేర్ చేసింది. ఈ మూవీకి కమల్‌హాసన్ నిర్మాతగా వ్యవహరిస్తుండగా అనిరుధ్ మ్యూజిక్ అందిస్తున్నాడు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

## ఎన్నికల బరిలో బండ్ల గణేష్



నిర్మాత బండ్ల గణేష్ ఎన్నికల బరిలో నిలవబోతున్నాడు. త్వరలో జరగనున్న తెలుగు ఫిల్మ్‌ప్రొడ్యూసర్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నాడు. ఈ ఎన్నికల్లో బండ్ల గణేష్‌కు ప్రత్యర్థిగా మరో సీనియర్ ప్రొడ్యూసర్ సీ కళ్యాణ్ బరిలో ఉంటున్నాడు. వారిద్దరూ నామినేషన్లు వేశారు. ఈ ఎన్నికల్లో బండ్ల గణేష్‌ను దిల్ రాజు సారథ్యంలోని యాక్టివ్ తెలుగు ప్రొడ్యూసర్ గిల్డ్ సపోర్ట్ చేస్తున్నట్లు సమాచారం. వైస్ ప్రెసిడెంట్ పదవి కోసం మోహన్ వడ్లపట్ల, కేఎల్ దామోదర ప్రసాద్, జీవితా రాజశేఖర్‌తో పాటు భరత్ చౌదరి నామినేషన్లు వేశారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 28ని తుది గడువుగా నిర్ణయించారు. సెప్టెంబర్ 6న ఈ ఎన్నికలు జరగనున్నాయి.



## రిజెక్ట్ చేయడమే మంచిదైంది

టాక్సిక్ కంటే ముందు నయనతార, కియారా అద్వానీ కాంబినేషన్‌లో ఓ సినిమా రావాల్సింది. నయన్ భర్త విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీతోనే కియారా తమిళ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వాల్సింది. లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ మూవీతో కియారాను తమిళ ఇండస్ట్రీకి పరిచయం చేయాలనుకున్నారు విఘ్నేష్ శివన్. కానీ కథ నచ్చక ఆమె ఈ సినిమాను రిజెక్ట్ చేసింది. దీంతో ఆమె ప్లేస్‌లో కృతి శెట్టిని హీ రోయిన్‌గా తీసుకొని సినిమా చేయగా నయన్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించింది. దాదాపు 100 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ 50 కోట్ల లోపే వసూళ్లను రాబట్టి భారీ నష్టాలను మిగిల్చింది. తాజాగా చెన్నైలో జరిగిన టాక్సిక్ మూవీ తమిళ ప్రీ రిలీజ్ ఈవెంట్లో విఘ్నేష్ శివన్ మాట్లాడుతూ ఈ సినిమా రిజెక్ట్ చేయడమే కియారాకు మంచిదైందంటూ వ్యాఖ్యానించడంతో ఆ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.

## టాక్సిక్ టికెట్ ధరల పెంపు

- **జీవో జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం**

యశ్ టాక్సిక్ మూవీ టికెట్ ధరలను పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ జీవోను జారీ చేసింది. సింగిల్ స్క్రీన్స్‌లో 50, మల్టీప్లెక్స్‌లో 100 రూపాయలు పెంచేందుకు అనుమతులు ఇచ్చింది. ఆగస్ట్ 26 నుంచి సెప్టెంబర్ 4 వరకు మొత్తం 10 రోజులు ధరల పెంపు అమల్లో ఉంటుందని ఆ జీవోలో పేర్కొన్నారు. టికెట్ ధరల పెంచుతూనే తెలంగాణ ప్రభుత్వం ఓ కండీషన్ పెట్టింది. తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీ ఖాతాలో టాక్సిక్ నిర్మాతలు కోటి రూపాయలను జమ చేయాలని ఆదేశించింది. మరోవైపు కన్నడ డబ్బింగ్ సినిమాకు తెలంగాణలో టికెట్ ధరలను పెంచడంపై సినీ వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టాక్సిక్ మూవీని దిల్‌రాజు తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేస్తున్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వంతో ఆయనకు ఉన్న అనుబంధంతోనే టికెట్ ధరల పెంపుకు అనుమతులు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.